క్లుప్తంగా

గర్భిణులకు వైద్యపరీక్షలు

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో గురువారం మండల వైద్యాధికారిణి ప్రసూణరాణి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. క్యాతూర్ పీహెచ్‌సీలో కాన్పు చేయించుకున్న వారికి కేసీఆర్ కిట్లను అందజేశారు. వైద్య పరీక్షల అనంతరం గర్భిణులు 102 వాహనాల్లో స్వగ్రామాలకు బయలుదేరారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

అలంపూర్: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా లింగనవాయి గ్రామానికి చెందిన అడ్డాకుల వెంకటేశ్వర్లు రెండవ సారి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి నియామక పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా మరోసారి అవకాశం కల్పించిన ఏఐసీసీ కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇటిక్యాల అధ్యక్షుడిగా రుక్మాందర్‌రెడ్డి

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా శనగపల్లికి చెందిన రుక్మాందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి నియామక పత్రం అందజేసినట్లు రుక్మాందర్‌రెడ్డి తెలిపారు. అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అలంపూర్ ఎస్‌ఐగా రమేష్

అలంపూర్: స్థానిక ఎస్‌ఐగా రమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మహేందర్ నాగర్‌కర్నూల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నారాయణపేటలో విధులు నిర్వహిస్తున్న రమేష్ అలంపూర్‌కు బదిలీపై వచ్చారు.

ఘనంగా మొహర్రం ఉత్సవాలు



అలంపూర్: పట్టణంలో మొహర్రం ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. పీర్ల చావిడిలో కొలువుదీరిన బడే ఇమామ్ ఖాసీం, సింగవరంలో కొలువుదీరిన చోటే ఇమామ్ ఖాసీం పీర్లను గురువారం తెల్లవారుజామున ఊరేగించారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పీర్ల సవారీని తిలకించారు.

శిథిల భవనాల తొలగింపునకు చర్యలు

గద్వాల: మున్సిపాలిటీలో శిథిలావస్థకు చేరిన భవనాల తొలగింపునకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాత భవనాలు, కట్టడాలతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని గుర్తించారు. రెండు రోజుల పాటు మున్సిపల్ అధికారులు వార్డుల్లో పర్యటించి శిథిల భవనాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. నివాస యోగ్యానికి వీలు లేకుండా ఉన్నవారికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. ఒకటో వార్డులోని వెంకటేట, నాలుగో వార్డులోని జమ్మిచేడులో గురువారం మున్సిపల్ కమిషనర్ నర్సింహ పర్యటించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. దెబ్బతిన్న భవనాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగిస్తామని తెలియజేయగా, తామే తొలగించుకుంటామని, కొంత సమయం కావాలని యజమానులు కోరడంతో వదిలేసినట్లు అధికారులు తెలిపారు.

పెద్దొడ్డి సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు

మల్దకల్: మండలంలోని పెద్దొడ్డి సర్పంచ్ సునీతను గురువారం కలెక్టర్ వల్లూరు క్రాంతి సస్పెండ్ చేసినట్లు ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహించడంతో ఎంపీటీసీ రాజు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాలను సైతం సర్పంచ్ సునీత బేఖాతరు చేసినట్లు విచారణలో తేలడంతో కలెక్టర్ సర్పంచ్‌ను సస్పెండ్ చేశారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి

గద్వాల అర్బన్: డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులో హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక దౌదర్‌పల్లిలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు పంపిణీ చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలంలో నర్సింగ్ కళాశాల, ఏరియా ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించగా.. బాధితులు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. వీటిపై తుది తీర్పు వచ్చే వరకు బాధితుల పేర్ల మీదనే ఉండాలని, షరతులు లేకుండా 615 మందికి డబుల్‌బెడ్రూం ఇళ్లను కేటాయించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ శంకర్, ఇసాక్ ఉన్నారు.

అల‘జడి’వాన

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఒకవైపు పంటలు దెబ్బతింటుండగా, మరోవైపు మట్టి ఇళ్లు కూలిపోతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు. నెలరోజుల కిందట వర్షాలు లేక పంటలు నష్టపోగా.. అల్పపీడన ప్రభావంతో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో నష్టం చేకూరుతోందని రైతులు వాపోతున్నారు. వర్షాలకు కూలిన ఇళ్లను అధికారులు పరిశీలించి.. బాధిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. శిథిల ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దని సూచించారు. మరోవైపు చెరువులు, కుంటలు నీటితో నిండి కళకళలాడుతున్నాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.



మానవపాడు రైల్వే అండర్ బ్రిడ్జిలోకి చేరిన వర్షపునీరు

- ఎడతెరిపిలేని వర్షాలతో పంటలకు నష్టం
- కూలిన మట్టి ఇళ్లు
- పరిశీలించిన అధికారులు
- శిథిల ఇళ్ల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలింపు

శాంతినగర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పంట పొలాల్లోకి వర్షపునీరు వచ్చి చేరడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో బుధవారం 40.20 మి.మీ. గురువారం 48.06 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. తనగల, జూలెకల్, కొంకల, రామాపురం, జిల్లెడుదిన్నెలో 5 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు చెప్పారు. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నరేష్ సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే డయల్ 100ను సంప్రదించాలని తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. వర్షాలతో 16 ఇండ్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. వర్షాలతో పత్తి, మొక్కజొన్న, మిరప పంటలోకి నీరు చేరడంతో రైతులు కాల్వలను ఏర్పాటు చేశారు. ఇళ్లను పరిశీలించిన వారిలో ఎంపీఓ పద్మావతి ఉన్నారు.

మానవపాడు: మండల కేంద్రం సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జిలోకి వర్షపునీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే అండర్ బ్రిడ్జి గుండానే జాతీయ రహదారిపైకి వెళ్లాల్సి ఉండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షాలకు కూలిన ఇళ్లను ఎంపీడీఓ రమణారావు, ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి పరిశీలించారు. జల్లాపురంలో 8, అమరవాయిలో 2, ఏ.బుద్ధిపాడులో 2, చెన్ని పాడులో 2, చిన్నపోతులపాడులో ఒకటి, పెద్దపోతులపాడులో ఒక ఇల్లు కూలిపోయినట్లు తెలిపారు. వారి వెంట వైస్ ఎంపీపీ సోమ్మన్నగౌడ్ ఉన్నారు.

ధరూరు: కృష్ణానది పరివాహక ప్రాంతాలను ఎస్‌ఐ శివానందంగౌడ్ పరిశీలించారు. నాగర్‌దొడ్డిలో పాత ఇళ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. మట్టి మిద్దెలు, పాత ఇళ్లల్లో ఉన్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు.

మల్దకల్: మండలంలోని అమరవాయి, పాల్వాయి, ఎల్కూరు, తాటికుంట, నాగర్‌దొడ్డి, బిజ్వారం గ్రామాల్లో 30కిపైగా ఇళ్లు కూలిపోయినట్లు అధికారులు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని పుటాన్‌దొడ్డి, షాబాద్, గోపల్‌దిన్నె, ఉదండాపురం, బుడ్డారెడ్డిపల్లి, వావిలాల గ్రామాల్లో మట్టి ఇళ్లు కూలిపోయాయి. వల్లూరు సమీపంలోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ అశోక్‌బాబు సూచించారు.

అయిజ: మండలంలోని చిప్పదొడ్డి–జడుదొడ్డి గ్రామాల మధ్య నిర్మిస్తున్న వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు కోతకు గురైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ సాయిప్రకాష్, ఆర్‌ఐ మద్దిలేటి వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎవరూ ప్రయాణించకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. పట్టణంలో కూలిపోయిన ఇళ్లను మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పరిశీలించారు. అత్యవసర సమయంలో 9440742959, 9052508485, 9000385031 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



ఉండవెల్లిలో పత్తిచేనులో నిలిచిన వర్షపునీరు



జల్లాపురంలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు



వల్లూరు వద్ద ఉధృతంగా పారుతున్న పెద్దవాగు

ప్రజలను అప్రమత్తం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్నాభాషా

గద్వాలఅర్బన్: వర్షాలతో ఎలాంటి నష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాభాషా అధికారులను కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్‌శాఖ అధికారులు స్తంభాల వద్ద షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత ఇళ్లల్లో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించి అన్ని వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో అల్తాఫ్ హుస్సేన్, ప్రసాద్, రఫీ, ఇమాముద్దీన్, షమీమ్, అంజద్ ఉన్నారు.

మట్టి ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్ర

శాంతినగర్: భారీ వర్షాల కారణంగా పాత ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దని, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఎంపీడీఓ రవీంద్ర పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతు గ్రామాల్లో కూలిన ఇళ్ల వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతోపాటు డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ఆదేశించారు. ఎంపీఓ తిరుపతన్న, ఏపీఓ విజయలలిత, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, సత్యం, లక్ష్మణ్, నాగరాజు, వినోద్, మహేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్ ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కరువు



తుమ్మళ్లపల్లిలో రోడ్డుపై నిలిచిన మురుగును పరిశీలిస్తున్న రంజిత్‌కుమార్

గట్టు: గ్రామాల్లో మౌలిక వసతులు కరువై ప్రజలు అవస్థలు పడుతున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రంజిత్ కుమార్ అన్నారు. గురువారం తుమ్మళ్లపల్లి, ముచ్చోనిపల్లె గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సరైన డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగు రోడ్లపై పారుతోందన్నారు. మురుగుతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. తుమ్మళ్లపల్లెలో అర్హులకు పింఛన్లు అందడంలేదని తెలిపారు. 6నెలల కిందట నిర్మించిన సీసీరోడ్డు వర్షాలకు కొట్టుకుపోయిందని, పంచాయతీ వెనుక జమ్ము పెరిగి దుర్వాసన వస్తోందన్నారు. అంగన్‌వాడీ టీచర్ లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ముచ్చోనిపల్లెలో రేషన్ డీలర్ లేకపోవడంతో బియ్యం కోసం సమీప గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు బలరాంనాయుడు, వెంకట్రాములు, తిమ్మప్ప, లక్ష్మన్న, ప్రేమ్‌రాజు, పరుశరాముడు, ఆశన్న, అమరేష్, మల్దకల్, ఆంజనేయులు, కృష్ణ, జగదీష్, తిమ్మప్ప, భీముడు, రామలింగ, రామకృష్ణ, తిమ్మప్పగౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



ధరూరు: మండల కేంద్రంలో దోమల నివారణకు గురువారం ఫాగింగ్ చేశారు. సీజనల్ వ్యాధులకు కారణమయ్యే దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఫాగింగ్ చేయించినట్లు సర్పంచ్ పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి తెలిపారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అయిజలో అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు భీమసేనరావు మాట్లాడుతూ దేశానికి అబ్దుల్ కలాం అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, భగత్‌రెడ్డి, ఓబీసీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, యువ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాజోళి: దివంగత అబ్దుల్‌కలాం వర్ధంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాం రెడ్డి, యువజన సంక్షేమ సంఘం నాయకుడు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదర్శ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, ఉపసర్పంచ్ సయ్యద్ రెహ్మాన్, ఆదర్శ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కార్యదర్శి కృష్ణ, నర్సప్ప, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, సైదీభాషా, మక్తర్‌భాషా, జనార్దన్, తిరుపాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

గద్వాల అర్బన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో గురువారం గద్వాల, మల్దకల్, కేటీదొడ్డి, ధరూరు మండలాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జెడ్పీ చైర్‌పర్సన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతుందని, రాబోయే రోజుల్లో గద్వాల నియోజకవర్గం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మద్దిలేటి, ధరూరు రవి, ఇమ్మానియేల్, జనార్దన్, రమేష్, లక్ష్మణ్, గోవిందు, నాగరాజు, నాగరాజు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

సర్దుబాటుతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు

గద్వాల: విద్యాశాఖలో సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం తపస్ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో మరో పాఠశాలకు పంపించడం వల్ల తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. దీని వల్ల విద్యార్థులకు కూడా సరైన న్యాయం జరగడం లేదన్నారు. సింగిల్ ప్యాట్రన్ ఉన్న ఉపాధ్యాయులను అదే పాఠశాలలో కొనసాగించాలని కోరారు. గ్రామపంచాయతీల ద్వారా విద్యావలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలను శుభ్రంగా ఉంచేందుకు స్కావెంజర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లారెడ్డి, మహేందర్, నాగరాజు, ప్రవీణ్, జగన్మోహన్‌రెడ్డి, మల్లికార్జున్, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, సుంకన్న, భాస్కర్, మురళీధర్‌రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

పునఃపరిశీలించాలి

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురంలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించిన జాబితాను పునఃపరిశీలించాలని నాయకులు మహానందిరెడ్డి, వీరేష్ గురువారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులకు అన్యాయం జరగకుండా ఇంటి స్థలాలు కేటాయించాలని సంబంధిత అధికారులను కోరారు.

వ్యక్తి అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడుకు చెందిన గొల్ల నాగరాజు (28) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. మతిస్థిమితం సరిగాలేని అతడు ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని, కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయిందన్నారు. నాగరాజు తమ్ముడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదలకు సర్కారు అండ



ఉండవెల్లి: పేదలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని ఇటిక్యాలపాడుకు చెందిన ఎద్దుల మోహన్‌రెడ్డికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యం ఇతర కారణాలతో ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స చేయించుకునే పేదలను సీఎంఆర్‌ఎఫ్‌తో ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సురవరం లోకేశ్వర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణ, నర్సింహ, ఈదన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీఓ

అలంపూర్: చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్రహంను గద్వాల ఆర్డీఓ చంద్రకళ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ వీరభద్రప్ప ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యం



మల్దకల్: ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యం అందుతోందని డాక్టర్ జయమ్మ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పు చేయించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, సత్యమ్మ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఉండవెల్లి: మండల కేంద్రంతోపాటు తక్కశీల, ప్రాగటూరు, కంచుపాడు, డి.బూడిదపాడు శివారులోని పంటలను గురువారం ఏడీఏ సక్రియానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. వర్షం తగ్గిన తర్వాత క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలని తెలిపారు. ఏడీఏ వెంట ఏఈఓ ఆదిల్ ఉన్నారు.



రైతు పక్షపాతి ప్రధాని మోదీ



శాంతినగర్‌లో ఎరువుల సబ్సిడీపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు



అయిజలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతుల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో గురువారం రైతులతో కలిసి టీవీలో మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలతో ఏ పంటకు ఏ ఎరువు వేయాలి, క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలో కిసాన్ సంవృద్ధి కేంద్రాల ద్వారా రైతులకు సూచిస్తున్నట్లు తెలిపారు. పంటలకు మద్దతు ధర ప్రకటించడంతోపాటు రసాయన ఎరువులపై బస్తాకు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. కిసాన్ సమ్మాన్‌నిధితో రైతులకు రూ.6వేల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. మన గ్రోమోర్ మేనేజర్ షఫి పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్ : పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని బీజేపీ నాయకులు టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మద్దిలేటి, జగన్మోహన్ రెడ్డి, నాగమల్లయ్య, నరేష్, శరత్, ఈశ్వరయ్య, మద్దిలేటి, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

శాంతినగర్: రైతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ నాయకులు అన్నారు. శాంతినగర్‌లోని మన గ్రోమోర్ సెంటర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణనాయుడు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఎరువులపై అనేక సబ్సిడీలు అందిస్తోందన్నారు. ఎరువుల సబ్సిడీకి సంబంధించిన బోర్డులను ఫర్టిలైజర్ దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు సల్ఫర్ కోటెడ్ యూరియాను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. మూడు విడుతల్లో రూ.2వేల చొప్పున పెట్టుబడి సాయం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, అధికార ప్రతినిధి రాజగోపాల్, వెంకటేశ్వర్లు, మోహన్‌యాదవ్, అయ్యరాజు, రాజశేఖర్, నర్సింహులు, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కోదండాపురం, ఎర్రవల్లి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ మండల అధ్యక్షుడు జగదీష్ అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అనేక రాయితీలు అందించి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మానిక్యారెడ్డి, తిమ్మారెడ్డి, శంకరెడ్డి, మహేష్, నవీన్, పరమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సందర్శకుల సందడి





జూరాల ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద గురువారం సందర్శకులు సందడి చేశారు. జూరాలకు భారీ వరద వచ్చి చేరుతుండడంతో ఏడు క్రస్ట్ గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. ప్రాజెక్టు క్రస్టు గేట్ల వద్ద నీటి పొంగులను చూస్తూ పరవశించిపోయారు. ముఖద్వారాలు, వ్యూ పాయింట్ల వద్ద సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. వరద నేపథ్యంలో రేవులపల్లి ఎస్‌ఐ శివానందంగౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.